క్లుప్తంగా

వైభవంగా రామాలయ వార్షికోత్సవం



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వేపాడ: మండల కేంద్రంలోని కోదండ రామాలయ ఆరో వార్షికోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. గ్రామపెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యుల నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ పురోహితుడు గోపాజోస్యుల సాయిరామ్ శర్మ మంత్రోచ్చారణల నడుమ స్వామికి పంచామృతాభిషేకాలు, తదితర పూజలు జరిపి, నూతన వస్త్రాలతో అలంకరించారు. రాత్రి స్వామివారి ఆలయ ప్రాంగణంలో బైటో భజన కార్యక్రమం నిర్వహించారు.

తహసీల్దార్‌గా ధర్మరాజు



తహసీల్దార్‌కు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

చీపురుపల్లి: మండల తహసీల్దార్‌గా డి.ధర్మరాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రాజాం నియోజకవర్గంలోని వంగర తహసీల్దార్‌గా ఇంతవరకు విధులు నిర్వహించిన ధర్మరాజు సాధారణ బదిలీల్లో భాగంగా చీపురుపల్లికి వచ్చారు. కార్యాలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. ఇంతవరకు ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన ఎన్.రాజారావుకు డెంకాడకు బదిలీ జరిగింది. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కాంతం, ఆర్ఐ రామ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ టీవీఎస్.మూర్తి, వీఆర్ఓలు ఆనంద్, గోవింద, తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు



సోమలింగాపురం జంక్షన్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

మెరకముడిదాం: జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని మూడు ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు బుధరాయవలస ఎస్సై జె.లోకేష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ.. మండలానికి చెందిన ప్రధాన రహదారి మొత్తం ఈ మూడు కూడళ్లతోనే ముడిపడి ఉండడంతో ఆయా చోట్ల కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. నేరాల నియంత్రణకు కెమెరాలు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు.

14 నుంచి బస్‌పాస్‌లు

శృంగవరపుకోట: ప్రస్తుత విద్యా సంవత్సరంలో కొత్త బస్‌పాస్‌లు ఈనెల 14వ తేదీ నుంచి జారీ చేస్తామని ఆర్టీసీ డిపో మేనేజర్ కె.రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులకు ఉచిత పాస్‌లు, మిగిలిన వారికి రాయితీ పాస్‌లు జారీ చేస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు దరఖాస్తులను ఆన్‌లైన్ చేయించుకోవాలని సూచించారు.

పనికి తగ్గ వేతనాలు లేవు

- ఎఫ్ఏ, టీఏలపై ఫిర్యాదులు
- ముషిడిపల్లిలో జరిగిన ఉపాధి పనులపై విచారణ



ముషిడిపల్లిలో విచారణ చేస్తున్న ఏపీడీ పద్మజ

శృంగవరపుకోట: కష్టపడి పని చేసినా తగిన ఫలితం ఉండడం లేదని.. చుట్టుపక్కల గ్రామాల వారికి వచ్చిన వేతనం తమకు దక్కడం లేదని ముషిడిపల్లి వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. టెక్నికల్ అసిస్టెంట్ రాధ, ఫీల్డ్ అసిస్టెంట్ సూర్యనారాయణ వర్క్ రికార్డు చేయడంలో శ్రద్ధ చూపడం లేదని, వారి నిర్లక్ష్యంతో తాము నష్టపోతున్నామని, పనిలోకి రాని వారికి మస్తర్లు వేస్తున్నారని ఉపాధి వేతనదారులు ఆరోపించారు. ఇటీవల క్షేత్రస్థాయిలో ఆందోళన చేసి, నిరసన తెలియజేయడంతో జిల్లా అధికారులు క్షేత్రస్థాయి విచారణకు ఆదేశించారు. ఈ మేరకు ఏపీడీ పద్మజ, ఏపీఓ రమ్య, తదితరులు బుధవారం గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా వేతనదారులు మాట్లాడుతూ.. వారం రోజులు పనిచేస్తే 168 రూపాయలు మాత్రమే వచ్చిందని అధికారులకు తెలిపారు. అలాగే ఫీల్డ్ అసిస్టెంట్ కొడుకు పని చేయకుండానే మస్తర్లు వేశారని.. పనికి తగ్గ వేతనం ఇవ్వడం లేదని.. పొరుగు గ్రామాల వేతనదారులకు రోజుకు రూ. 300 వేతనం వస్తున్నా తమకు రావడం లేదని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఏపీడీ పద్మజ మాట్లాడుతూ.. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. విచారణలో గ్రామ పెద్దలు, ఉపాధి వేతనదారులు, ఎఫ్ఏ, టీఏలు, తదితరులు పాల్గొన్నారు.

- పూర్తికాని పాఠశాలల భవనాలు
- అవే సమస్యల నడుమ కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం

ఈ ఏడాదీ.. విద్యార్థులకు తప్పని అవస్థలు



విశాఖ డెయిరీ పాల కేంద్రంలో ఏప్రిల్-23న పాఠం చెబుతున్న ఉపాధ్యాయుడు (ఫైల్)



వేచలపువానిపాలెం ప్రాథమిక పాఠశాలలో పూర్తికాని భవనం పనులు

లక్కవరపుకోట: విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తామని గొప్పలు చెప్పుకునే కూటమి నాయకులు ఆచరణలో ఘోరంగా విఫలమయ్యారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని కొనసాగించడంలో విఫలం కావడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులకు పలు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. పాఠశాలలు పునఃప్రారంభం నాటికి విద్యార్థులకు విద్యా కిట్లు అందజేయాలని ప్రణాళికలు తయారు చేసుకున్నా.. అమలులో చతికిలపడ్డారు. మరోవైపు గత ప్రభుత్వం హయాంలో నాడు - నేడు కార్యక్రమంలో మంజూరైన పాఠశాల భవన నిర్మాణాలను పూర్తి చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. మండలంలోని వేచలపువానిపాలెంలో గల ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి, అదనపు తరగతి గదుల నిర్మాణానికి గతంలో నిధులు మంజూరయ్యాయి. అయితే కూటమి ప్రభుత్వం పాలన ప్రారంభమై ఏడాది పూర్తయినా నిర్మాణాలను పూర్తి చేయలేకపోయారు. దీంతో గ్రామంలో గల విశాఖ డెయిరీ పాలకేంద్ర భవనంలో తరగతులు నిర్వహించారు. సెలవుల్లో పనులు పూర్తి చేస్తారన్న విద్యార్థుల తల్లిదండ్రులు ఎంతో ఆశపడ్డారు. కాని వారి ఆశలు అడియాసలయ్యాయి. అలాగే మండలంలో సుమారు 2740 మంది విద్యార్థులు ఉండగా.. వారికి ఇంతవరకు యూనిఫారాలు, షూలు రాలేదు. కొత్తవలస మండలంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

బాధ్యతల స్వీకరణ



రామకృష్ణ, ఉప తహసీల్దార్

వేపాడ: మండల రెవెన్యూ కార్యాలయంలో ఉప తహసీల్దార్‌గా పి.రామకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కొత్తవలస, వేపాడ మండలాలకు సీఎస్‌డీటీగా పనిచేసిన ఆయన వేపాడ మండలానికి ఉప తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు. అలాగే ఇంతవరకు ఇక్కడ పనిచేసిన సన్యాసి నాయుడుకు మన్యం జిల్లాకు బదిలీ జరిగింది. అలాగే వేపాడ ఏఎస్ఓగా సీహెచ్.శివ బాధ్యతలు స్వీకరించారు.

ఎల్.కోట సీనియర్ సహాయకుడిగా రాజేష్..



రాజేష్, సీనియర్ సహాయకుడు

లక్కవరపుకోట: మండల తహసీల్దార్ కార్యాలయం సీనియర్ సహాయకుడిగా సీహెచ్.రాజేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కొత్తవలస మండల ఆర్ఐగా పనిచేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. కార్యాలయం సిబ్బంది రాజేష్‌కు ఘన స్వాగతం పలికారు.

వేతన బకాయిలు విడుదల చేయాలి

- వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు



క్షేత్ర సహాయకుడికి వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు, వేతనదారులు

బొండపల్లి: ఉపాధి వేతనదారులకు పది వారాలుగా బకాయి పడిన వేతనాలను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మండలంలోని కనిమెరకలో చేపడుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం క్షేత్రసహాయకుడు అల్లు వెంకటరమణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపీడీఓ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించనున్న ఆందోళన కార్యక్రమానికి వేతనదారులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరికీ 200 రోజులు పని కల్పించి, రోజుకు 600 రూపాయల వేతనం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు గోవింద రాంబాబు, వేతనదారులు పి.సూర్యనారాయణ, ఎ.మహేష్, ఈ.ఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి..



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు అప్పలనాయుడు

దత్తిరాజేరు: పంటలు ముంపునకు గురికాకుండా చర్యలు తీసుకుని రైతులను ఆదుకోవాలని వి.కృష్ణాపురం గ్రామానికి చెందిన రైతు అప్పలనాయుడు కోరారు. ఈమేరకు తహసీల్దార్ విజయభాస్కర్‌ను బుధవారం కలిసి సమస్య వివరించారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ..ఖరీఫ్ సీజన్ దగ్గర పడుతున్నా రైల్వే మూడో లైన్ పనులలో భాగంగా పంట ముంపునకు గురవ్వకుండా గోడ కడతామన్న రైల్వే అధికారులు ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. కోమటిపల్లి రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డులో కోమటిపల్లి రెవెన్యూలో ఉన్న భూములకు చెరువులు నిండిన తర్వాత కాలువ నుంచి వచ్చే నీరు పంట పొలాల వైపు వెళ్లకుండా.. గోడ నిర్మిస్తామని అప్పట్లో రైల్వే అధికారులు హామీ ఇచ్చారన్నారు. వెంటనే గోడ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు.

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

- ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

గుర్ల: గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పనే ధ్యేయమని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీలో రూ. 2 కోట్లతో చేపట్టనున్న ఆదనపు గదులకు.. జెడ్పీ పాఠశాలలో రూ.4.95 లక్షలతో చేపట్టనున్న కళావేదిక పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు పలు అభివృద్ధి పనులు, భవనాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ పొట్నూరు ప్రమీల, జెడ్పీటీసీ సభ్యుడు శీర అప్పలనాయుడు, జేడీ వీటీ రామారావు, ఎంపీడీఓ శేషుబాబు, తహసీల్దార్ ఆదిలక్ష్మి, టీడీపీ నేతలు వెన్నె సన్యాసి నాయుడు, టి. కిరణ్‌కుమార్, సీహెచ్. మహేశ్వర రావు, కిలారి సూర్యనారాయణ, పిల్ల అప్పల నాయుడు, దాసరి శివప్రసాద్ పాల్గొన్నారు.

స్థానిక ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వడం లేదు..

- ఎంపీపీ చల్లా చలం నాయుడు



సమావేశంలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీపీ చలం నాయుడు

బొండపల్లి: గ్రామాల్లో ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టినా రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వాలని ఎంపీపీ చల్లా చలంనాయుడు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.కొత్తవలస సర్పంచ్ కర్రోతు శ్రీనివాసరావుతో పాటు కనిమెరక, కిండాం అగ్రహారం సర్పంచ్‌లు సిరిపురం ఆదినారాయణ, బుంగ దేవుడు, అంబటివలస ఎంపీటీసీ సభ్యుడు తాళ్లపూడి అప్పలనాయుడులు, తదితరులు అధికారుల తీరుపై ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో ఎటువంటి పనులు చేపట్టినా, ప్రారంభోత్సవాలు చేసినా తమకు సమాచారం ఇవ్వడం లేదని ఆరోపించారు. వివిధ శాఖల అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని మండిపడ్డారు. మండల సర్వసభ్య సమావేశంలో ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన సమస్యలను అధికారులు మినిట్స్ బుక్‌లో రాస్తున్నారు గాని, వాటిని జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లడం లేదని ఆరోపించారు. స్వచ్ఛభారత్ కింద చెత్త సంపద కేంద్రాల్లో మరుగుదొడ్లు నిర్మించి ఏడాదైనా ఇంతవరకు బిల్లులు మంజూరు చేయలేదని బి. రాజేరు సర్పంచ్ ఈదుబిల్లి కృష్ణ అన్నారు. ముద్దూరులో కొంతమంది లబ్ధిదారులను ఇళ్ల పట్టాలకు ఎంపిక చేసినా, ఇంతవరకు పట్టాలు మంజూరు చేయలేదని ఆ గ్రామ సర్పంచ్ మునకాల పైడిపునాయుడు సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వరరావు స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. సమావేశానికి దేవుపల్లి పీహెచ్‌సీ నుంచి ఒక్కరూ కూడా హాజరుకాకపోవడంపై ఎంపీపీ అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే ఇటీవల మృతి చెందిన కో ఆప్షన్ సభ్యుడు షేక్ అబ్దుల్ రజాక్ మృతికి సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.గిరిబాల, డీటీ రాజేశ్వరరావు, ఏఓ కె.తులసీనాథ్, ఈఓపీఆర్‌డీ రఘుపతిరావు, సీనియర్ సహాయకుడు ఎస్.శ్రీనివాసరావు, వివిధ శాఖలు అధికారులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అన్యాయం

- వ్యవసాయ కార్మిక సంఘు జిల్లా కార్యదర్శి అప్పారావు



తహసీల్దార్ బి.రత్నకుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పురం అప్పారావు, తదితరులు

గజపతినగరం: కూటమి ప్రభుత్వం హయాంలో పేదలకు అన్యాయం జరుగుతోందని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి పురం అప్పారావు ఆరోపించారు. సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయడంతో పాటు నిరుపేదలను ఆదుకోవాలని కోరుతూ తహసీల్దార్ బి. రత్నకుమార్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సూపర్‌సిక్స్ హామీల్లో ఒక్క పింఛన్ తప్ప మేరే పథకమూ అమలు చేయలేదన్నారు. రైతులే దేశానికి వెన్నెముక అని చెప్పే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేడు వారిని పట్టించుకోవడం లేదని వాపోయారు. వ్యవసాయ కార్మికులను ఆదుకునేందుకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నిరుపేద వ్యవసాయ కార్మిక కుటుంబాలను గుర్తి మూడు ఎకరాల చొప్పున అందజేయాలని కోరారు.అలాగే ఇళ్ల స్థలాలు కూడా మంజూరు చేయడంతో పాటు నిర్మాణానికి ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కె.భీముడు, తదితరులు పాల్గొన్నారు.

భోజనం వడ్డించిన ఎంఈఓ



గజపతినగరం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు మండల విద్యాశాఖాధికారి విమలమ్మ బుధవారం మధ్యాహ్న భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు నిర్వాహకులు దృష్టి సారించాలన్నారు. ఆమెతో పాటు సీఆర్పీలు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.
– గజపతినగరం రూరల్

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

- ఏపీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులు



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ ప్రతినిధులు



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న విలేకరులు

చీపురుపల్లి: వర్కింగ్ జర్నలిస్టులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. సమస్యల సాధన కోసం ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర యూనియన్ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం నియోజవకర్గ కేంద్రమైన చీపురుపల్లిలో డిమాండ్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ సూర్యకాంతంను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎంతో కాలంగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయింపు జరగడం లేదన్నారు. అర్హులైన జర్నలిస్టులకు మూడు సెంట్ల స్థలాన్ని కేటాయించాలని కోరారు. ప్రస్తుతం జర్నలిజం వృత్తి ప్రమాదంలో పడిన నేపథ్యంలో జర్నలిస్టుల రక్షణ కోసం మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో ఎన్నో రాష్ట్రాల్లోని మాదిరిగా ఏపీలో కూడా వర్కింగ్ జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. మీడియా అకాడమీను బలోపేతం చేసి జర్నలిస్టులకు ప్రతి ఏటా అవార్డులు ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు బలగ రామారావు, ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ, ఉపాధ్యక్షులు పవన్, నర్సింగరావు, మురళి, వెంకటేశ్వరరావు, టీవీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలను పునరుద్ధరించండి..

శృంగవరపుకోట: కేంద్రం రద్దు చేసిన జర్నలిస్ట్ చట్టాలను తిరిగి పునరుద్ధరించాలని ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ప్రతినిధులు కోరారు. ఈమేరకు స్థానిక తహసీల్దార్ శ్రీనివాసరావును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ.. 1955 వేతన చెల్లింపు చట్టం, 1958 వర్కింగ్ జర్నలిస్ట్ యాక్ట్‌లు విలేకరుల వృత్తి ప్రమాణాలు కాపాడడానికి, వేజ్‌బోర్డుల ఏర్పాటుకు, వేతనాల చెల్లింపులకు ఉపకరిస్తాయన్నారు. ఈ చట్టాల రద్దు వల్ల వృత్తి ప్రమాణాలకు విఘాతం కలుగుతోందని తెలిపారు. వెంటనే చట్టాలను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో బాపునాయుడు, నానాజీ, కె.వీరారెడ్డి, ఆనంద్, శంకర్, శ్రీను, ధర్మ, తదితరులు పాల్గొన్నారు.

బాలికా విద్యకు ప్రోత్సాహం

- మంత్రి శ్రీనివాసరావు



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్, తదితరులు

బొండపల్లి: కూటమి ప్రభుత్వం బాలికల విద్యకు పెద్దపీట వేస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని దేవుపల్లిలో గల కస్తూరిబా గాంధీ విద్యాలయంలో బాలికల అప్‌గ్రేడ్ జూనియర్ కాలేజ్‌కు సంబంధించి 2 కోట్ల 12 లక్షల రుపాయలతో నిర్మించనున్న తరగతి గదుల నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కేజీబీవీల్లో చదివే విద్యార్థినులకు అన్ని సౌకర్యాలు కల్పించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ పీఓ ఎ.రామరావు, తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు, ఎంపీడీఓ గిరిబాల, నాయకులు రాపాక అచ్చంనాయుడు, కోరాడ కృష్ణ, బండారు బాలాజీ, వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

శిలాఫలకం ఆవిష్కరణ..

దత్తిరాజేరు: మండల కేంద్రంలోని కేజీబీవీలో అప్‌గ్రేడ్ జూనియర్ కళాశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణాలకు సంబంధించి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా విద్యార్థినులతో మాట్లాడుతూ..అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. సర్వశిక్ష ఏపీడీ రామారావు మాట్లాడుతూ.. కోటీ 60 లక్షలతో నిర్మిస్తున్న భవనాలను ఆరు నెలల్లో పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, తహసీల్దార్ విజయభాస్కర్, కేజీబీవీ ప్రత్యేక అధికారి శివజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

గజపతినగరం రూరల్: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో మండల పరిధిలోని 32 గ్రామాలకు శుక్రవారం వేకువజాము 3 గంటల నుంచి 9 వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో కార్యనిర్వాహక ఇంజినీర్ ఎ. అనంతరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గజపతినగరం, ఎం.వెంకటాపురం, రైల్వేస్టేషన్, తమ్మారాయుడిపేట, మరుపల్లి, మధుపాడ, కేఎస్ఆర్ పురం, గంగచోళ్లపెంట, ఎం.గుమడాం, కాలంరాజుపేట, సీతారామపురం, ముద్దూరు, కొణిశ, సాలిపేట, కొత్తబగ్గాం, బంగారమ్మపేట, బూడిపేట, ఓలమ్ కంపెనీతో పాటు 32 గ్రామాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎల్.కోటలో..

లక్కవరపుకోట: మండల కేంద్రంలో గల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో పలు గ్రామాలకు శుక్రవారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ సూరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. లక్కవరపుకోట, సోంపురం జంక్షన్, సంతపేట జంక్షన్ ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మిత్రధర్మం పాటించడం లేదు..

- ఎమ్మెల్యే తీరుపై బీజేపీ నాయకుల ఆగ్రహం



ఎస్.కోటలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

శృంగవరపుకోట: కూటమి ప్రభుత్వంలో భాగస్వాములైన వారికి సముచిత స్థానం కల్పించడంలో స్థానిక ఎమ్మెల్యే లలితకుమారి మిత్రధర్మం పాటించడం లేదని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీజేపీ నాయకుడు సీహెచ్ అప్పారావు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే లలితకుమారి కూటమిలో ఉన్న తమకు గౌరవం ఇవ్వడం లేదని ఆరోపించారు. ఇటీవల భర్తీ చేసిన నామినేటెడ్ పదవులు, సాగునీటి సంఘాలు, మార్కెట్ కమిటీలు, బీసీ రుణాలు, తదితర నియామకాలు, పథకాల్లో ఎందులోనూ బీజేపీ నాయకులు, సానుభూతిపరులకు అవకాశం ఇవ్వలేదని మండిపడ్డారు. మరో సీనియర్ నాయకుడు డి.సూర్యారావు మాట్లాడుతూ.. కూటమి విషయంలో అధిష్ఠానం సూచనల మేరకు జిల్లా నాయకులు సైతం పలు దఫాలు మాట్లాడినా ఫలితం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవీఎల్ రామకోటి మాట్లాడుతూ.. కూటమిలో భాగస్వాములమైన మాకు సముచిత స్థానం, గౌరవం ఇస్తారని ఆశించినా ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదన్నారు. మరో సీనియర్ నాయకుడు మాన్యం దేముడు మాట్లాడుతూ.. కూటమిలో ఉన్నందుకు సంతోషించాలో, ఎవ్వరికీ ఏమీ చేయలేని స్థితిలో ఉన్నామని ఏడవాలో తెలియడం లేదని వాపోయారు. ఐదు మండలాల పార్టీ అధ్యక్షులు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు డి.దాశరధి, టి.రాముడు, ఎల్.పవన్, పి.శివకుమార్, మరిసా శ్రీను, ఆర్.లక్ష్మి, బి.చంద్రశేఖర్ డి.శ్రీనివాస్, గోపి, తదితరులు పాల్గొన్నారు.